సాత్విక్ జోడీ ముందంజ

కౌలాలంపూర్: భారత బ్యాడ్మింటన్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి మలేషియా ఓపెన్‌లో క్వార్టర్స్‌కు చేరుకుంది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో భారత ద్వయం 21-15, 21-15తో మలేషియాకే చెందిన అజ్రిన్ అయూబ్-టాన్ వి కియోంగ్‌ను ఓడించింది. వరుస గేమ్‌లను గెలుచుకున్న భారత షట్లర్లు.. 43 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించారు. సాత్విక్-చిరాగ్ మినహా మిగిలిన భారత షట్లర్లు ప్రిక్వార్టర్స్‌లోనే ఇంటిబాట పట్టారు. హెచ్ఎస్ ప్రణయ్, మాళవిక బన్సోడ్, క్రాస్టో-ధ్రువ్ జోడీ రౌండ్ ఆఫ్-16లోనే నిష్క్రమించింది.

క్వార్టర్స్‌కు రాజస్థాన్, హర్యానా

- విజయ్ హజారే ట్రోఫీ

వడోదర: దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో రాజస్థాన్, హర్యానా క్వార్టర్స్ బెర్తును ఖాయం చేసుకున్నాయి. గురువారం వడోదరలో తమిళనాడుతో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్.. 19 పరుగుల తేడాతో గెలిచింది. రాజస్థాన్ ఓపెనర్ అభిజీత్ తోమర్ (111) శతకంతో కదం తొక్కగా కెప్టెన్ లోమ్రర్ (60) రాణించడంతో ఆ జట్టు 47.3 ఓవర్లలో 267 పరుగులు చేసింది. తమిళనాడు మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (5/52) ఐదు వికెట్లతో మెరిశాడు. కానీ ఛేదనలో తమిళనాడు 47.1 ఓవర్లలో 248 పరుగులకే చేతులెత్తేసింది. మరో మ్యాచ్‌లో హర్యానా.. 72 పరుగుల తేడాతో బెంగాల్‌ను చిత్తు చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన హర్యానా.. నిర్ణీత ఓవర్లలో 298/9 పరుగులు చేసింది. బెంగాల్ తరఫున ఆడుతున్న టీమ్ఇండియా స్టార్ పేసర్ మహ్మద్ షమీ (3/61) మూడు వికెట్లు పడగొట్టాడు. కానీ బెంగాల్ 226 పరుగులకే కుప్పకూలింది. క్వార్టర్స్‌లో హర్యానా.. గుజరాత్‌తో తలపడనుండగా, రాజస్థాన్ విదర్భతో తలపడనుంది.

మనీశ్‌పాండే, అశ్రిత దూరం దూరం!

బెంగళూరు: టీమ్ఇండియా క్రికెటర్ల వైవాహిక జీవితం ఒడిదొడుకుల పయనంగా సాగుతున్నది. ఇప్పటికే స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్యా తన భార్య నటాషా స్టాన్కోవిచ్‌తో తెగదెంపులు జరుగగా, యుజువేంద్ర చాహల్, ధనశ్రీ మధ్య విభేదాలు పొడచూపగా, తాజాగా మరో జంట ఈ జాబితాలో చేరింది. మనీశ్‌పాండే, అశ్రిత శెట్టి విడాకులు తీసుకోబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఒకరికొకరు సోషల్‌మీడియా ఇన్‌స్టాగ్రామ్‌లో అన్‌ఫాలో చేసుకోవడం దీనికి మరింత బలాన్ని చేకూరుస్తున్నది. 2019 డిసెంబర్ 2 ఒక్కటైన మనీశ్, అశ్రిత గత కొన్ని రోజులుగా విడివిడిగా ఉంటున్నారు. అశ్రిత తన సోషల్‌మీడియాలో మనీశ్ ఫొటోలు తీసేయగా, మనీశ్ కూడా అదే పని చేస్తూ అన్‌ఫాలో చేశాడు. టీమ్ఇండియా తరఫున 29వన్డేలు, 39 టీ20లు ఆడిన మనీశ్ ఫామ్‌లేమితో సతమతమవుతున్నాడు. ఇటీవల జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో ఐదు మ్యాచ్‌లు ఆడి 117 పరుగులకే పరిమితమయ్యాడు.

కావచ్చు..కాకపోవచ్చు

విడాకులపై స్పందించిన చాహల్

న్యూఢిల్లీ: టీమ్ఇండియా క్రికెటర్ యుజువేంద్ర చాహల్..తన భార్య ధనశ్రీవర్మతో విడాకులపై వస్తున్న వార్తలపై ఎట్టకేలకు స్పందించాడు. గురువారం తన ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొస్తూ విడాకులు కావచ్చు..కాకపోవచ్చు అంటూ పేర్కొన్నాడు. 'మీ మద్దతు లేకుండా నేను ఇప్పుడు ఈ స్థాయిలో ఉండే వాడిని కాదు. క్లిష్ట సమయాల్లో మీరు నా పట్ల చూపించిన అభిమానం మరువలేనిది. దేశం కోసం, జట్టు కోసం, అభిమానుల కోసం ఇంకా ఆడుతాను. ప్లేయర్‌గా గర్వపడుతున్నాను. ఇటీవల నా వ్యక్తిగత విషయాలపై సోషల్‌మీడియాలో రకరకాలుగా పోస్ట్‌లు వచ్చాయి. అవి నిజం కావచ్చు, కాకపోవచ్చు. మా కుటుంబ విషయాల్లో కలుగజేసుకోవద్దని మిమ్మల్నికోరుకుంటున్నాను' అని వివరించాడు.

నాగల్‌కు కఠిన డ్రా

- ఆస్ట్రేలియా ఓపెన్

మెల్‌బోర్న్: ప్రతిష్ఠాత్మక ఆస్ట్రేలియా ఓపెన్‌లో భారత టెన్నిస్ ఆటగాడు సుమిత్ నాగల్‌కు తొలి రౌండ్‌లోనే కఠిన ప్రత్యర్థి ఎదురయ్యాడు. గురువారం వెలువడిన మెయిన్ డ్రాలో భాగంగా మొదటి రౌండ్‌లో నాగల్.. ప్రపంచ 26వ నంబర్ ఆటగాడు థామస్ మకాచ్ (చెక్ రిపబ్లిక్)తో తలపడనున్నాడు. గత సీజన్ షాంఘై మాస్టర్స్‌లో ప్రపంచ రెండో నంబర్ ఆటగాడు కార్లోస్ అల్కారజ్‌ను థామస్ ఓడించాడు. ఇక ప్రస్తుతం ఏటీపీ ర్యాంకింగ్స్‌లో 96వ స్థానంలో ఉన్న నాగల్ గతేడాది ఈ టోర్నీలో రెండో రౌండ్‌కు చేరగా ఈ సీజన్‌లో మరోసారి సత్తా చాటాలని భావిస్తున్నాడు. ఇక ఈ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్లు అయిన జన్నిక్ సిన్నర్, అరీనా సబలెంక, మాజీ చాంపియన్ నొవాక్ జొకోవిచ్‌కు తొలి రౌండ్‌లో సులువైన ప్రత్యర్థులు ఎదురయ్యారు.

సెమీస్‌కు బాంబ్రీ జోడీ

ఆక్లాండ్: భారత టెన్నిస్ ఆటగాడు యూకీ బాంబ్రీ, ఫ్రాన్స్ సహచరుడు అల్బనో ఒలివెట్టి ద్వయం ఆక్లాండ్‌లో జరుగుతున్న ఏఎస్‌బీ క్లాసిక్ టోర్నీలో సెమీఫైనల్‌లోకి ప్రవేశించింది. గురువారం ఇక్కడ జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్స్ మ్యాచ్‌లో ఈ ఇండో, ఫ్రెంచ్ జోడీ.. 3-6, 6-4, 12-10తో బ్రిటన్ జంట జులియన్-లాయిడ్ గ్లాస్‌పూల్‌ను ఓడించింది.

సెమీస్‌లో కార్తీక్ జోడీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: వరల్డ్ టూర్ ఐటీఎఫ్ టెన్నిస్ టోర్నీలో భారత జోడీ సాయి కార్తీక్‌రెడ్డి, విష్ణువర్ధన్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో కార్తీక్, విష్ణు ద్వయం 6-4, 6-4తో ఎరిక్ వాన్షెల్బెయిమ్(ఉక్రెయిన్), లూకా కాస్టెనువో(స్విట్జర్లాండ్) జోడీపై గెలిచి ముందంజ వేసింది. ఆది నుంచే తమదైన దూకుడు ప్రదర్శించిన కార్తీక్ జంట వరుస సెట్లలో ప్రత్యర్థిని మట్టికరిపించింది.

హ్యాట్రిక్ సిరీస్ వేటలో

నేటి నుంచే భారత్, ఐర్లాండ్ వన్డే పోరు • మంధాన సారథ్యంలో బరిలోకి టీమ్ఇండియా • యువ బౌలర్లకు సదావకాశం

మ్యాచ్‌లన్నీ రాజ్‌కోట్‌లోని సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో జరుగుతాయి.

ఉదయం 11 గంటల నుంచి స్పోర్ట్స్-18లో

రాజ్‌కోట్: గతేడాది ముగిసిన టీ20 ప్రపంచకప్ తర్వాత స్వదేశంలో న్యూజిలాండ్, వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లను గెలుచుకుని జోరు మీదున్న భారత మహిళల జట్టు మరో సమరానికి సిద్ధమైంది. శుక్రవారం నుంచి రాజ్‌కోట్ వేదికగా ఐర్లాండ్‌తో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా తొలి వన్డే జరుగనుంది. గత రెండు సిరీస్‌లను దక్కించుకుని జోరు మీదున్న టీమ్ఇండియా.. ఐర్లాండ్‌నూ చిత్తు చేసి హ్యాట్రిక్ సాధించాలని ఉవ్విళ్లూరుతోంది. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి భారత్‌లో జరగాల్సి ఉన్న మహిళల వన్డే వరల్డ్‌కప్ జరుగనున్న నేపథ్యంలో జట్టులో చోటు ఆశిస్తున్న యువ క్రికెటర్లకు, తమ స్థానాన్ని పటిష్టం చేసుకునేందుకు సీనియర్లకు ఈ సిరీస్ సదావకాశం. భారత్‌తో తొలిసారి ద్వైపాక్షిక సిరీస్ ఆడుతున్న ఐర్లాండ్.. ఆతిథ్య జట్టుకు పోటీనిచ్చేందుకు సిద్ధమైంది.

మంధాన.. జోరు సాగనీ..

ఈ సిరీస్‌లో రెగ్యులర్ సారథి హర్మన్‌ప్రీత్ కౌర్‌కు సెలక్టర్లు విశ్రాంతినిచ్చిన నేపథ్యంలో స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన జట్టును నడిపించనుంది. ఇటీవలి కాలంలో పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో ఆమె మంచి ఫామ్‌లో ఉంది. వరుసగా ఐదు అర్ధ శతకాలు సాధించిన ఆమె జోరు కొనసాగించాలని చూస్తోంది. షఫాలీ వర్మకు ఈ సిరీస్‌లోనూ చోటు దక్కని నేపథ్యంలో ప్రతీకతో కలిసి మంధాన ఇన్నింగ్స్‌ను ఆరంభించనుంది. టాపార్డర్‌లో హర్మన్‌ప్రీత్ లేకపోవడంతో మంధాన, ప్రతీకతో పాటు వెస్టిండీస్ సిరీస్‌లో తొలి శతకం సాధించిన హర్లీన్ డియోల్‌పై మరింత భారం పడనుంది. జెమీమా రోడ్రిగ్స్, వికెట్ కీపర్ బ్యాటర్ రీచా ఘోష్ కూడా తలా ఓ చేయి వేస్తే ఐర్లాండ్ బౌలర్లకు తిప్పలు తప్పవు.

యువ బౌలర్లు సత్తా చాటేనా?

హర్మన్‌ప్రీత్‌తో పాటు సీనియర్ పేసర్ రేణుకా సింగ్ ఠాకూర్‌కూ విశ్రాంతినిచ్చిన నేపథ్యంలో పేస్ బాధ్యతలను యువ పేసర్లు టిటాస్ సాధు, సయిమా ఠాకూర్ మోయనున్నారు. విండీస్‌తో టీ20 సిరీస్‌లో 13 వికెట్లు పడగొట్టిన సాధు.. తన స్వింగ్, పేస్‌తో మరోసారి సత్తా చాటాలని భారత్ ఆశిస్తోంది. ఇప్పటి దాకా 8 వన్డేలాడి 7 వికెట్లు పడగొట్టిన సయిమా కూడా జట్టులో స్థానం సుస్థిరం చేసుకునేందుకు ఈ సిరీస్ చక్కని అవకాశం. వైస్ కెప్టెన్‌తో పాటు స్పిన్ బాధ్యతలను మోయనున్న దీప్తి శర్మకు ప్రియా మిశ్రా, తనూజా ఏ మేరకు అండగా నిలుస్తారనేది చూడాలి.

పోటీనిచ్చేనా..

భారత్‌తో ఇంత వరకు జరిగిన 12 వన్డేలలో ఒక్కదాంట్లోనూ గెలవని ఐర్లాండ్.. ఈ సిరీస్‌లో అయినా మంధాన సేనకు గట్టి పోటీనివ్వాలని పట్టుదలతో ఉంది. కెప్టెన్ గాబీ లూయిస్, ఆల్‌రౌండర్ ఒర్లా ప్రెండర్‌గస్ట్, లీ పాల్, అర్లెనె కెల్లీ ఆ జట్టులో కీలకం. స్వదేశంలో పటిష్టంగా ఉండే భారత్‌ను ఐర్లాండ్ ఏ మేరకు ఎదుర్కొంటుందనేది ఆసక్తికరం.

కౌంటీల్లో కోహ్లీ!

ఢిల్లీ: ఇటీవల పేలవ ఫామ్‌తో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ దేశవాళీలో ఆడాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే. సుమారు పదేండ్లుగా దేశవాళీ వైపు కన్నెత్తి చూడని కోహ్లీ.. ఈ ఏడాది ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు ముందు మాత్రం తన మనసు మార్చుకున్నట్టు తెలుస్తోంది. కానీ భారత్‌లో కాకుండా ఇంగ్లండ్ కౌంటీలలో ఆడాలని విరాట్ నిశ్చయించుకున్నట్టు సమాచారం. జూన్ 20 నుంచి మొదలుకాబోయే టెస్టు సిరీస్‌కు ముందు కోహ్లీ.. కౌంటీలు ఆడనున్నాడని తెలుస్తోంది. ఒకవేళ ఐపీఎల్-2025లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ప్లేఆఫ్స్‌కు వెళ్తే అతడు కనీసం రెండు వారాల పాటు అయినా కౌంటీలు ఆడతాడని, లీగ్ దశలోనే వెనుదిరిగితే సుమారు నెల రోజుల పాటు కౌంటీలకు కేటాయించనున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఒకవేళ కోహ్లీ గనక కౌంటీలలో ఆడితే ఇంగ్లండ్ పరిస్థితులకు అలవాటు పడేందుకు అవి అతడికి ఎంతగానో ఉపయోగపడతాయి.

సారథులుగా ప్రతీక్, ప్రియాంక

ఢిల్లీ: ఢిల్లీ వేదికగా ఈనెల 13 నుంచి మొదలుకాబోయే ఖోఖో ప్రపంచకప్ తొలి ఎడిషన్‌కు భారత్ సారథులను ప్రకటించింది. పురుషుల జట్టుకు ప్రతీక్ వాయికర్, మహిళల జట్టుకు ప్రియాంక ఇంగ్లె కెప్టెన్లుగా వ్యవహరించనున్నారు. జనవరి 13 నుంచి 19వ తేదీ వరకు జరిగే ఈ టోర్నీలో భారత పురుషుల జట్టు నేపాల్‌తో, మహిళల జట్టు దక్షిణ కొరియాతో జరిగే మ్యాచ్‌లతో టైటిల్ వేటను ఆరంభించనున్నాయి.

క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మందమర్రి జీఎం దేవేందర్, అధికారులు

మందమర్రి, జనవరి 9: సింగరేణి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎం జీ.దేవేందర్ అధికారులతో కలిసి నూతన సంవత్సర-2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థలోని వివిధ గనులలో వినియోగిస్తున్న అత్యాధునిక సాంకేతిక యంత్రాలు, సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు, ఉద్యోగుల సంక్షేమం తదితర చిత్రాలతో క్యాలెండర్‌ను రూపొందించినట్లు వివరించారు. అన్ని గనులు, విభాగాల్లో ఉద్యోగులందరికీ క్యాలెండర్లను పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్వోటూ జీఎం విజయ్‌ప్రసాద్, ఏఐటీయూసీ మందమర్రి, బెల్లంపల్లి, రామకృష్ణాపూర్ బ్రాంచ్ కార్యదర్శులు సలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేశ్, అక్బర్ అలీ, ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, డీవైపీఎం ఎండీ ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు. మందమర్రి పట్టణంలోని స్టేషన్ రోడ్డులో గల శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి, లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి వెళ్లే దారిలో కోల్‌బెల్ట్ రహదారి వద్ద నూతనంగా ఆలయ కమిటీ, సింగరేణి సహకారంతో ఏర్పాటు చేసిన కమాన్‌ను గురువారం జీఎం దేవేందర్ ప్రారంభించారు.

ఇంటర్నల్ జూనియర్ అసిస్టెంట్ పరీక్షలు నిర్వహించాలి

సీసీసీ నస్పూర్, జనవరి 9: సింగరేణిలో ఇంటర్నల్ జూనియర్ అసిస్టెంట్ రాత పరీక్షలు వెంటనే నిర్వహించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. యాజమాన్యం గతేడాది దాదాపు 360 మంది ఇంటర్నల్ జూనియర్ అసిస్టెంట్ ఖాళీలు ఉన్నాయని ప్రకటించి భర్తీ చేయకపోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. శ్రీరాంపూర్ ఏరియాలో జూనియర్ అసిస్టెంట్లు, క్లర్కుల కొరత చాలా తీవ్రంగా ఉందని, దీంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతుండడంతో పరిపాలన కుంటుపడుతుందని తెలిపారు. చాలా చోట్ల క్లర్కుల కొరతతో జనరల్ మజ్దూర్లతో క్లర్కు పనులు చేయిస్తున్నారని పేర్కొన్నారు. కొత్త వారితో క్లర్కు పనులు చేయించడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, దీంతో పనులన్నీ పెండింగ్‌లోనే ఉంటున్నాయని పేర్కొన్నారు. యాజమాన్యం వెంటనే జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు పరీక్షలు నిర్వహించి ఖాళీలను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు.

మినీ స్టేడియానికి స్థల పరిశీలన

జైపూర్, జనవరి 9: మండలంలోని టేకుమట్ల గ్రామంలో ప్రతిపాదిత మినీ స్టేడియం స్థలాన్ని గురువారం శ్రీరాంపూర్ జీఎం సూర్యనారాయణ సందర్శించారు. గ్రామంలో మినీస్టేడియం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఇటీవల వినతిపత్రం అందించగా ఇందారం ఓపెన్‌కాస్టు ప్రాజెక్టు అధికారి ఏవీ రెడ్డితో కలిసి స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ సతీశ్, స్థానిక నాయకులు నర్సయ్య, సత్యనారాయణరావు, రమేశ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్లలో ప్రతిపాదిత మినీ స్టేడియం స్థలాన్ని పరిశీలించిన జీఎం

స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి చేయూత

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, జనవరి 9 : స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధి దిశగా ప్రభుత్వం అనేక పథకాల ద్వారా చేయూతనందిస్తున్నామని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఆర్ఎస్ఈటీఐ) ఉట్నూరు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జూట్ బ్యాగ్ శిక్షణ కార్యక్రమంలో డీఆర్డీవో కిషన్, ఆర్ఎస్ఈటీఐ సంచాలకులు మహ్మద్ గౌస్, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ తిరుపతితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్ఎస్ఈటీఐ ఆధ్వర్యంలో 2 బ్యాచ్‌లకు జూట్ బ్యాగ్‌ల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంతరం జన్నారం మండలంలో 13 రోజుల పాటు మొదటి బ్యాచ్‌లో శిక్షణ పొందిన 35 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు టూల్‌కిట్లు, ధృవీకరణ పత్రాలు అందించారు. స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఏకరూప దుస్తులను తయారు చేసేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేడీఎం రాంచందర్, శిక్షకులు శ్రీనివాస్, ఆశన్న, సతీశ్, స్వర్ణలత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

ఖేలో ఇండియా క్రీడా పోటీలు ప్రారంభం

మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న విద్యార్థులు

రామకృష్ణాపూర్, జనవరి 9: మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ ఠాగూర్ స్టేడియంలో అఖిల భారత ఫుట్‌బాల్ సంఘం సారథ్యంలో తెలంగాణ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ స్థాయి (సౌత్ జోన్) అండర్ బాలికల ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలను పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను గురువారం ప్రారంభించారు. కేర్ ఫుట్‌బాల్ అకాడమీ(నిజామాబాద్) జట్టు, గజ్వేల్ ఫుట్‌బాల్ అకాడమీ (సిద్దిపేట్) జట్టు తలపడగా కేర్ ఫుట్‌బాల్ అకాడమీ జట్టు విజేతగా నిలిచింది. ఉమెన్స్ ఫుట్‌బాల్ అకాడమీ(ఖమ్మం) జట్టు లెనిన్ స్టార్ ఫుట్‌బాల్ అకాడమీ క్లబ్ (ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా) జట్లు తలపడగా ఖమ్మం జట్టు విజేతగా నిలిచింది. తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ జట్టు, ఉమెన్స్ ఫుట్‌బాల్ అకాడమీ (హైదరాబాద్) జట్లు తలపడగా హైదరాబాద్ (రంగారెడ్డి) జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో మందమర్రి ఏరియా జీఎం దేవేందర్, పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్,రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం సెక్రెటరీ పల్గుణ, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి తహసీల్దార్ సతీశ్, జిల్లా ఫుట్ బాల్ సంఘం సెక్రెటరీ పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారుడు కట్టా ఈశ్వరాచారి, నాయకులు పల్లె రాజు, గోపతి రాజయ్య, అబ్దుల్ అజీజ్, గాండ్ల సమ్మయ్య, అక్బర్ అలీ, కంభగోని సుదర్శన్‌గౌడ్, రామడుగు లక్ష్మణ్, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విదేశీ విద్య కోసం స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించాలి

- భారత జాగృతి, సింగరేణి యువజన విభాగం రాష్ట్ర నాయకుడు సిద్దిక్

శ్రీరాంపూర్, జనవరి 9 : సింగరేణి కార్మికుల పిల్లలకు విదేశీ విద్యకు స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించాలని భారత జాగృతి రాష్ట్ర నాయకుడు, సింగరేణి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సిద్దిక్ షేక్ డిమాండ్ చేశాడు. యాజమాన్యం కార్మికుల పిల్లలకు విదేశీ విద్య, ఉద్యోగావకాశాలకు 'చమట చుక్కలకు తర్ఫీదు' పథకాన్ని ప్రవేశ పెట్టడం సంతోషకరమన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా యువతకు విదేశీ విద్యపై కొంత అవగాహన ఉందని తెలిపారు. తర్ఫీదుకు బదులుగా విదేశీ విద్య అర్హత సాధించేందుకు ఐఈఎల్‌టీఎస్, టీవోఈఎఫ్ఎల్, డీయూఓఎల్ఐఎన్‌జీవో వంటి అనేక పోటీ పరీక్షల కోసం యాజమాన్యం కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎంపికైన వారికి ఫీజు రీయింబర్స్‌మెంటు కల్పించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఐఐటీ, ఐఐఎం సీట్లు సాధించిన విద్యార్థులకు సింగరేణి కార్మికుల పిల్లలకు ఫీజు రీయంబర్స్‌మెంట్ కల్పించిందన్నారు. విదేశీ విద్యకు కూడా అవసరమైన సాయాన్ని అందించాలని యాజమాన్యానికి సూచించిందన్నారు. ఆస్ట్రేలియా, కెనడా, యూకే వంటి దేశాల్లో అధునిక మైనింగ్ విద్య అందుబాటులో ఉండడం వల్ల మైనింగ్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కూడా చాలా ఉన్నాయని తెలిపారు. ఈ పథకాన్ని అమలు చేయకుంటే సింగరేణి యువజన విభాగం ఆధ్వర్యంలో సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలు

ఎదులాపురం,జనవరి 9 : మాదక ద్రవ్యాల వినియోగం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. మిషన్ పరివర్తన్ నషాముక్త్ భారత్‌లో భాగంగా గురువారం ఆదిలాబాద్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు మాస్టర్ వాలంటరీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్టేట్‌లెవల్ కోఆర్డినేటింగ్ ఏజెన్సీ ప్రాజెక్టు ఆఫీసర్ సుధాకర్, వైద్యులు శ్రీనివాస్ డ్రగ్స్ వినియోగం, అనర్థాలు, చికిత్స, మానిపించడం తదితర వాటి గురించి శిక్షణ ఇచ్చారు. డ్రగ్స్ వల్ల అనర్థాల గురించి అంగన్‌వాడీలతో పాటు సీనియర్ సిటిజన్లకు అవగాహన కల్పించామని సైకియాస్టిస్ శ్రీనివాస్ తెలిపారు. డ్రగ్స్ తీసుకున్న వారిని దానికి విముక్తి కలిగించేలా రిహాబిలిటేషన్ సెంటర్లు ఉన్నాయన్నారు. డ్రగ్స్ తీసుకోవాలని కోరిక ఉన్న వారికి ముందస్తుగా నివారించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సబిత, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ సాయికిరణ్, వయోవృద్ధుల సమాఖ్య అధ్యక్షుడు దేవీదాస్ దేశ్‌పాండే, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

విజిటర్స్ కోసం గది ఏర్పాటు

గోలేటి జీఎం కార్యాలయంలో విజిటర్స్ గదిని ప్రారంభిస్తున్న బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్

రెబ్బెన, జనవరి 9: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో విజిటర్స్ కోసం గది ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించినట్లు బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో అధునీకరించిన గదిని గురువారం రిబ్బన్‌కట్ చేసి ప్రాంభించిన అనంతరం మాట్లాడారు. జీఎం కార్యాలయానికి వచ్చే ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, సింగరేణి ప్రభావిత గ్రామాల ప్రజల కోసం విజిటర్స్ గది ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జీఎం కార్యాలయంలోని అన్ని విభాగాల సిబ్బంది పనులు పెండింగ్ లెకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, సివిల్(ఎస్ఈ) మదీనబాషా, సీనియర్ అకౌంటెంట్ ఆఫీసర్ సౌమ్య, తదితరులున్నారు.

జాతీయ స్థాయికి విద్యార్థులు ఎంపిక

నస్పూర్, జనవరి 9 : ఈ నెల 7 నుంచి 9 వరకు మహబూబ్‌నగర్ జడ్చర్లలో జరిగిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శన, రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో ప్రతిభ కనబర్చి మంచిర్యాల జిల్లా విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఇన్‌స్పైర్ విభాగంలో కోటపల్లి మండలంలోని అన్నారం జడ్పీహెచ్ఎస్‌కు చెందిన శ్రావణ్‌కుమార్, రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనలో విభాగంలో దేవాపూర్‌లోని డీఏవీ పాఠశాలకు చెందిన సాయిశోభిత ఎంపికయ్యారు. వీరిని డీఈవో యాదయ్య, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు అభినందించారు.

హెచ్ఎంపీవీ వైరస్‌పై ఆందోళన చెందవద్దు

- డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్

మంచిర్యాల అర్బన్, జనవరి 9: జిల్లాలో హెచ్ఎంపీవీ వైరస్ వ్యాప్తి లేదని ప్రజలు ఆందోళన చెందవద్దని మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీశ్ రాజ్ అన్నారు. గురువారం వారు ప్రకటనలో తెలిపారు. ఒక వేళ వ్యాధి సోకితే సాధారణంగా దగ్గు, జ్వరం, ముక్కుదిబ్బడ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్న వారిలో బ్రాంకైటీస్ నిమోనియా వంటి సమస్యలకు దారి తీయవచ్చని తెలిపారు. వైరస్ సోకిన మూడు నుంచి ఆరు రోజుల్లో వ్యాధి లక్షణాలు కనిపిస్తాయని, ఇది ముఖ్యంగా పిల్లలు వృద్ధులు, రోగ నిరోధక వ్యవస్థ బలహీనంగా ఉన్నవారికి వ్యాపిస్తుందన్నారు. తరచూ 20 సెకండ్ల పాటు చేతులను శుభ్రం చేసుకోవాలని, దగ్గు తుమ్ముల సమయంలో నూటికి రుమాలు లేదా టవల్ అడ్డుపెట్టుకోవాలని సూచించారు. ప్రైవేట్ దవాఖానల వైద్యులు మేనేజ్‌మెంట్ వారు ఎలాంటి భయాందోళనకు గురి చేయరాదని వెల్లడించారు. జిల్లాలోని 17 ఆరోగ్య కేంద్రాలు, నాలుగు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మూడు సామాజిక ఆరోగ్య కేంద్రాలు, మాతా శిశు సంరక్షణ జిల్లా దవాఖాన, సింగరేణి దవాఖానల్లో ముందస్తుగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆశ ఆరోగ్య కార్యకర్తలకు వైద్య సిబ్బందికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రజలు మాస్కులను ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డెమో బుక్క వెంకటేశ్వర్, ఎపీడమాలజిస్ట్ సుమన్ పాల్గొన్నారు.